క్లుప్తంగా

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని పురాతన సీతారామ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. సీతారామ స్వామి ఆలయంలో రూ.70 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంతో పేరొందిన ఈ ఆలయాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావును ఆదేశించారు.

బియ్యం ధరలు అదుపు చేయాలి

బోట్‌క్లబ్: సార్వత్రిక ఎన్నికల అనంతరం 26 కేజీల బియ్యం బస్తా ధర రూ.1450 నుంచి రూ.1600కు పెరగడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని నగర పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సోనామసూరి, బీపీటీ వంటి సన్న రకాల ధరలు రోజు రోజుకీ పెరగడం వల్ల నిరుపేదలకు బియ్యం కొనుగోలు చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు క్రమంగా పెరగడంతో ఇంటి బడ్జెట్ రెట్టింపై గృహిణీలు ఆందోళన చెందుతున్నారన్నారు. గత ఏడాది ధాన్యం దిగుబడులు లేకపోవడంతో ధాన్యం కొరత ఉందని అందుకే బియ్యం రేట్లు పెరుగుతున్నాయని రైస్‌మిల్లర్లు ప్రచారం చేసుకొంటూ రోజురోజుకూ బియ్యం ధరలు పెంచుతున్నారన్నారు. గొడౌన్‌లో ఉన్న బియ్యాన్ని మార్కెట్‌లోని తరలిస్తే బియ్యం ధరలు తగ్గుతాయని కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచుతున్నారన్నారు. అధికారులు బియ్యం గొడౌన్లలో తనిఖీలు చేపట్టి తక్కువ ధరలకు అమ్మే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



నడకుదురులో కనకదుర్గమ్మ పాదాలచెంత ఉంచిన సారె

కరప: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నడకుదురులో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ తల్లికి గ్రామస్తులు భారీ ఎత్తున స్వీట్లు, పండ్లు, పిండి వంటలతో కూడిన సారెను సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్క బిందె చొప్పున వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పిండి వంటలతో కూడిన సారెను తలపై ఎత్తుకొని ముత్తయిదువలు, మహిళలు, యువతులు తరలిరాగా మంగళవాద్యాలతో గ్రామ పెద్దలు వెంటరాగా గ్రామంలో వీధి, వీధిన సారెతో ఊరేగుతూ దుర్గాదేవి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి చెంత సారెను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సారెను ప్రసాదంగా గ్రామంలో ఇంటింటికీ పంచిపెట్టారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేస్తున్న యంగ్‌మైండ్ అధ్యక్షుడు చిన్న

బాలాజీచెరువు: యంగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని సంస్థ సభ్యులు పిల్లి గోవిందరాజు పేర్కొన్నారు. కొండయ్యపాలెం నూకలమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం నవరాత్రులు సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి 300 మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడులు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ యంగ్ మైండ్స్ సంస్థ ద్వారా అటు విద్యా విషయాలపై అవగాహనతో పాటు సామాజిక సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని సంస్థ వ్యవస్థాపకులు వాకాడ వెంకటరమణ(చిన్నా) సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు కామేశ్, పిల్లి గోవిందరాజులు, ప్రదీప్‌కుమార్, నూకరాజు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కాకినాడ: ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, సమస్యలను మొబైల్ నెంబర్ 9959225534కు తెలియజేయవచ్చునని చెప్పారు.

ప్రశస్త యాప్.. లోపాలకు చెక్..!

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వీరి కోసం పలు పథకాలు అందుబాటులో ఉన్నా పూర్తి స్థాయిలో అందలేని పరిస్థితి ఉంది. వీరి ఆధార్ కార్డుల్లో జనన తేదీలు, పేరు, చిరునామా వంటి వివరాలు తప్పుగా ఉండటం, బ్యాంక్ ఖాతా లావాదేవీలు నిర్వహించకపోవడం, రేషన్, ఆధార్ కార్డుల్లో తప్పులు, మొబైల్ లింక్ లేకపోవడం తదితర కారణాలతో సాయం పొందలేని పరిస్థితి ఉంది. దీన్ని అధిగమించేందుకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎస్‌సీఈఆర్టీ ప్రశస్త యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది.

- నమోదుతో ప్రత్యేక అవసరాల బాలల భవితకు భరోసా
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి

బాలాజీచెరువు: ప్రత్యేక అవసరాలు గల బాలలకు వివిధ పరికరాల సాయంతో శిక్షణ ఇచ్చేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఏపీ సమగ్రశిక్ష ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ పథకం ద్వారా నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయులదే బాధ్యత..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వివరాలను పార్ట్–1లో హెచ్‌ఎం, ఉపాధ్యాయుడి పేరు, సర్వీస్ నెంబర్, మొబైల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అయ్యాక నమోదు చేయాలి. లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులను పార్ట్–2 కింద ప్రత్యేక అవసరాల పిల్లలుగా పరిగణించి పరిశీలిస్తారు.

అర్హులకు ప్రయోజనం చేకూర్చేందుకే..

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారు. ఇంటి వద్ద శిక్షణ పొందే పిల్లలకు విద్య, ప్రభుత్వ పథకాల లబ్ధి సైతం ఇంటి వద్దే అందివ్వాలి. ఇంటి వద్ద శిక్షణ పొందే వారికి మరింత ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశ్యంతో ప్రశస్త యాప్‌ను తీసుకొచ్చారు

21 రకాల వైకల్యాలు నమోదు..

ప్రశస్త యాప్‌లో పిల్లల వివరాల నమోదుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. వైకల్యాలను గుర్తించేందుకు 63 ప్రశ్నలు రూపొందించారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాల గుర్తింపుకు ప్రశస్త యాప్ ఉపయోగపడుతుంది. భవిత కేంద్రాల్లో ఐఈఆర్టీలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక విద్యా బోధకులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.



విద్యార్థికి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

భవిత కేంద్రాలు సంఖ్య	21
ప్రతిభా వంతుల సంఖ్య	3633
ఫిజియో థెరపిస్టుల సంఖ్య	06
ఐఈఆర్‌టీలు, ఆయాల సంఖ్య	3,321

గుర్తించాల్సిన లక్షణాలు ఇవే..

దృష్టిలోపం, తక్కువ దృష్టి, వినికిడి, శారీరక (చలన) వైకల్యం, మేధో మానసిక వైకల్యం, అభ్యసన వైకల్యం, మస్తిష్క మెదడు పక్షవాతం(సెరిబ్రల్ పాల్సీ), ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, బహుళ వైకల్యం, లెప్రసీ బాధితులు, మరుగుజ్జు తనం, దీర్ఘకాలిక నరాల సమస్యలు, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫిలియా (రక్తం గడ్డకట్టని స్థితి), సికిల్ సెల్ వ్యాధి,(కొడవలి కణ రక్తహీనతత) వంటి వాటిని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలి.

వందశాతం నమోదు చేస్తాం..



ప్రతి దివ్యాంగుడిని విధిగా గుర్తించేలా అందరి సమన్వయంతో కృషి చేస్తున్నాం.ఇప్పటికే అందరికీ ఆదేశాలు జారీ చేశాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో లోపాలు గుర్తించేందుకు ఈ ప్రశస్త యాప్ దోహదపడుతుంది. వీరిని ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు ద్వారా ప్రభుత్వ పథకాలు పొందే వీలుంటుంది.

చామంతి నాగేశ్వరరావు,సీఎంఓ,
సమగ్రశిక్ష అభియాన్, కాకినాడ జిల్లా

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

- 2,032 పనులకు సంబంధించి రూ.11.31 కోట్ల పనులపై తనిఖీ
- నేమాం గుత్తులవారిపాలెంలో అవకతవకలు గుర్తింపు

కాకినాడ రూరల్: మండలంలోని ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వామా పీడీ వెంకటలక్ష్మి నిర్వహించారు. మండలంలో 2,032 ఉపాధి పనులను రూ.11.31 కోట్లతో చేపట్టారు. వీటిపై గత నెల 26 నుంచి మంగళవారం వరకు సామాజిక తనిఖీ సిబ్బంది తనిఖీలు చేశారు.

సంబంధిత నివేదికను ప్రజా వేదికలో వెల్లడించారు. లోపాలు సరిదిద్దాలని ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ వెంకటలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. నేమాం గ్రామ పరిధిలోని గుత్తులవారి పాలెం స్కూల్ ఆయా, ఆశా వర్కర్ జాబ్ కార్డుతో పనులు చేపట్టినట్టు గుర్తించడంతో వారు పనుల్లో పాల్గొనరాదని పీడీ సూచించారు. నిబంధనలు పాటించాలన్నారు. అలాగే ఒకరి కార్డుపై మరొకరు పనులకు హాజరు వంటి వాటిని గుర్తించి నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ బందిలి విరీష, ఎంపీడీఓ సతీష్, పీఆర్ ఏఈ వాసుదేవ రావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కొండలరావు, ఏఈ గణేష్, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ పి.రామారావు తదతరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి

వీధికుక్కల నియంత్రణపై దృష్టి పెట్టండి

- బాధితులకు పరిహారం అందివ్వాలి
- పౌర సంక్షేమ సంఘం డిమాండ్

కాకినాడ: కాకినాడ సురేష్‌నగర్ పార్కులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ మహిళలతో పాటు బాలుడికి ఆర్థిక సాయం అందించాలని పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు నగరపాలక సంస్థను డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ 36 మంది బాధితులకు రూ.10 వేలు చొప్పున వైద్యం కోసం ఆర్థిక సాయం అందించిన రీతిలో ఇక్కడ కూడా ఇవ్వాలని ఆయన కోరారు. కాకినాడ నగరంలో సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసిన కాంట్రాక్టు సంస్థకు బకాయిలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి వీధిలో పదేసి చొప్పున నగరంలో పదివేల సునకాలు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి శునకాలను పంపించి కాకినాడలో వదిలిపెట్టడం వల్ల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం

కాకినాడ రూరల్: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తపాలా శాఖ ఉద్యోగులు మూర్తి, రామారావులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. తోకలేని పిట్టగా పేరొందిన ఉత్తరాల ద్వారా బంధువుల యోగ క్షేమాలు తెలుసుకునేందుకు తపాలా శాఖ అమూల్యమైన సేవలందించిందని ఆ శాఖ ఉద్యోగి కె.ప్రసాదరావు అన్నారు. మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో ఉత్తరాలకు ఆదరణ తగ్గిందన్నారు. తపాలాశాఖ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుందని, చిన్న మొత్తాల పొదుపు పథకం శాఖకు గుర్తింపు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, శాస్త్రి, రాజా తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో తపాలాశాఖ ఉద్యోగులకు సన్మానం

గర్భిణులకు వైద్య పరీక్షలు

కరప: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆర్.శ్రీనివాస్ నాయక్, డాక్టర్ యాంజలీన్ వైద్యపరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ప్రతినెల గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహాలు పాటిస్తే సుఖ ప్రసవాలు జరుగుతాయన్నారు. మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించారు. వేళంగి పీహెచ్‌సీలో 28 మంది గర్భిణిలు రాగా డాక్టర్ ఎంకే సౌజన్య వైద్యపరీక్షలు నిర్వహించి, పాటించాల్సిన సలహాలను వివరించారు. 12 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిబ్బంది గోవిందబాబు, రమణారావు, సూర్యకుమారి, కృష్ణశేఖర్, ఆశా వర్కర్లు సేవలందించారు.



వేళంగి పీహెచ్‌సీలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ సౌజన్య

సాయి పుణ్యతిథి మహోత్సవాలకు రాట ముహూర్తం

కరప: స్థానిక పల్లపువీధి గంటాలమ్మగుడి సన్నిధిలోని సాయి మందిరంలో 106వ సాయి పుణ్యతిథి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు భక్తులతో కలిసి రాట ముహూర్తం చేశారు. సాయి మందిరంలో ఈ నెల 13 నుంచి 21వరకు ఈ మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు ముత్య ప్రసాద్ పూజాదికాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, 23న సాయిబాబాను పల్లకీలో ఉంచి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 24న భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు వుయ్యూరి రామచంద్రరావు, చీకల వెంకట రమణ, శ్రీపాదం సత్యారావు, చిన్నారి వీరభద్రరావు, భాస్కరరావు, పెద్దాడ సత్తిరాజు, చిన్నారి మురళి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలకు రాట ముహూర్తం వేస్తున్న కమిటీ సభ్యులు

వాగ్దేవీ.. నమోస్తుతే..!



ఇంద్రపాలెం ముసలమ్మ గుడిలో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు



రక్తబీజాక్షుని వధ అవతారంలో పర్వత వర్ధినీదేవి



రక్తబీజాక్షుని వధ అలంకరణలో బాలాత్రిపుర సుందరి



అశోక్‌నగర్ షిరిడీ సాయిబాబా ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు

- చదువులమ్మకు చిన్నారుల పూజలు
- ఆలయాల్లో కుంకుమార్చనలు

కాకినాడ రూరల్: దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏడో రోజు బుధవారం ఆలయాలలో సరస్వతీ దేవి పూజలు ఘనంగా జరిగాయి. జ్ఞానాన్ని అందించే చదువుల తల్లి ఆశీస్సులు కోరుతూ సరస్వతీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. కాకినాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాలలో అమ్మవార్ల ఆలయాలలో దేవీ శరన్నవరాత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇంద్రపాలెం ముసలమ్మ గుడిలో విద్యార్థులకు సరస్వతి పూజలు నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన మాట్లాడుతూ జగన్మాత దుర్గాదేవిని పూజిస్తే కష్టాలు తొలగి సకల సిరి సంపదలు కలుగుతాయన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దుర్గాదేవి ఆలయాలు

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం మండలంలో వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలకరించి, భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరప, పేపకాయలపాలెం, పెనుగుదురు, నడకుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, యండమూరు, వేళంగి, వేములవాడ, వలసపాకల, కొరుపల్లి, అరట్లకట్ట, వాకాడ, కూరాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు తరలివచ్చి కుంకుమ పూజ చేయించుకున్నారు. కరప అర్చకులు కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి పూజాదికాలు నిర్వహించగా వేదపండితులు కుంకుమార్చనలు చేయించారు. కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరపలోని విష్ణ్వాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధినీదేవిని రక్తబీజాక్షుని వధ అవతారంగా అలంకరించి ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కరప మార్కెట్ యార్డు వద్ద దుర్గాదేవికి పూజాదికాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. ఆయా గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల్లో సరస్వతీదేవి పూజలు

పలు ఆలయాల్లో మూలా నక్షత్రం కలవడంతో అమ్మవారిని సరస్వతీదేవి అవతారంగా అలంకరించి, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పెనుగుదురులోని వేణుగోపాలస్వామి ఆలయంలో దేవదాయశాఖ, సరస్వతి బాల భక్త యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో అర్చకులు గోవర్ధనం సూర్యనారాయణాచార్యులు సామూహిక సరస్వతీదేవి పూజ చేయించారు. ఈఓ అపర్ణ, గ్రామస్తులు బండారు మురళి, సంఘ సభ్యులు బండారు వాసు, అల్లు బాబీ, తుమ్మలపల్లి వాసు, తుమ్మలపల్లి మాచర్రావు, టి.స్వామి, టి.లక్ష్మణరావు, తదితరులు విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో తరలివచ్చి సరస్వతీదేవి పూజ చేయించుకున్నారు. యండమూరులోని సామ్రాజ్య లక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు పూజలుచేసి విద్యార్థులతో సరస్వతీదేవి పూజలు చేయించారు.

సామూహిక సరస్వతీ పూజలు

కాకినాడ: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన స్థానిక దుగ్గిరాలవారివీధిలోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాలగ్రామ విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొనగా ఆలయ పూజారి, పండితులు సరస్వతీ పూజ చేయించారు. విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు బుధవారం అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం కావడంతో ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయాలు విద్యార్థులతో నిండిపోయాయి. పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్థానిక బాలా త్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు రక్తబీజాక్షుని వధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలాత్రిపుర సుందరి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి కీర్తనలు, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీ జ్యోతి నృత్య కళానికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం భక్తులను అలరించింది. మూల నక్షత్రం సందర్భంగా ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కనకదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులతో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ సరస్వతీ పూజలు చేయించారు. ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్చుత రామారావు పాల్గొన్నారు. ఆలయంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆలయ ఈఓ వరపల్లి శ్రీనివాసరావు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.



పెనుగుదురులో చిన్నారులతో సరస్వతీ పూజ చేస్తున్న మహిళలు



రమణయ్యపేట లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో పూజలు



దుగ్గిరాలవారివీధిలో సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు



బాలాత్రిపుర సుందరి ఆలయంలో సామూహిక పూజల్లో విద్యార్థులు